క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ


ఎస్‌ఐ వెంకటేశ్వర్లు

మునుగోడు : నూతనంగా మునుగోడు ఎస్‌ఐగా నియమితులైన సీహెచ్ వెంకటేశ్వర్లు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, యువకులు ఆయనను శాలువాతో సన్మానించారు.

గుర్తు తెలియని మృతదేహానికి దహన సంస్కారాలు

చిట్యాల : మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో గురువారం గుర్తు తెలియని మతిస్థిమితం లేని మహిళ మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఆ వార్డు కౌన్సిలర్ సత్తయ్య స్థానిక పోలీసు స్టేషన్‌లో సమాచారం ఇచ్చారు. మున్సిపాలిటీ సిబ్బంది వచ్చి మృతదేహానికి దహన సంస్కారాలు చేశారు.

ధాన్యం డబ్బులు చెల్లించాలి

కేతేపల్లి : కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతులకు ప్రభుత్వం వెంటనే డబ్బులు చెల్లించాలని డీసీసీ మాజీ ఉపాధ్యక్షుడు జతంగి వెంకటనర్సయ్యయాదవ్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ధాన్యం విక్రయించిన 20 రోజుల తర్వాత కూడా డబ్బులు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

దిల్‌సుఖ్‌నగర్ - మనిమద్దె బస్సు సర్వీసు ప్రారంభం


మాట్లాడుతున్న సూర్యాపేట డీఎం సురేందర్

శాలిగౌరారం : శాలిగౌరారం మండల ప్రయాణికుల సౌకర్యం నిమిత్తం సూర్యాపేట డిపో నుంచి దిల్‌సుఖ్‌నగర్-మనిమద్దె నైట్‌హాల్ట్ బస్సును గురువారం ప్రారంభించినట్లు సూర్యాపేట డీఎం డి.సురేందర్ తెలిపారు. బుధవారం రాత్రి మనిమద్దెలో ఆయన ప్రజలతో మాట్లాడారు. దిల్‌సుఖ్‌నగర్ నుంచి సాయంత్రం 4.30 గంటలకు బస్సు బయలుదేరి కట్టంగూర్, నకిరేకల్ మీదుగా మనిమద్దెకు రాత్రి 8.00 గంటలకు చేరకుంటుందని తెలిపారు. ప్రయాణికులు బస్సు సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రాజగోపాల్‌రెడ్డి జన్మదిన వేడుకలు

చండూరు : చండూరు, గట్టుప్పల మండలాల్లో మాజీ ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి జన్మదిన వేడుకలు బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి పంపిణీ చేశారు.

చిట్యాల : మునుగోడు మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి జన్మదిన వేడుకలను చిట్యాలలో బీజేపీ నాయకులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శేపూరి రవీందర్ కేక్ కట్ చేశారు. టౌన్ అధ్యక్షుడు కూరెళ్ల శ్రీను, పొట్లపల్లి నర్సింహగౌడ్, గంజి గోవర్ధన్, పల్లపు బుద్ధుడు, కోళ్ల స్వామి తదితరులు ఉన్నారు.

మునుగోడు : మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి జన్మదిన వేడుకలు మునుగోడులో ఘనంగా నిర్వహించారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో 80 మందికిపైగా యువకులు రక్తదానం చేశారు. డీసీసీబీ డైరెక్టర్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, వేమిరెడ్డి సురేందర్ రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ దూడల భిక్షం గౌడ్, మండల అధ్యక్షుడు తాటికొండ సైదులు తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడ : మండల కేంద్రంలో రాజగోపాల్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు రాందాసు శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ మేతరి యాదయ్య, యాస అమరేందర్‌రెడ్డి, కొడాల వెంకట్‌రెడ్డి, దీపికరెడ్డి, అల్వాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ


సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న సీఐ అశోక్ రెడ్డి

మునుగోడు : ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేస్తే నేరాలను నియంత్రించవచ్చని చండూరు సీఐ అశోక్ రెడ్డి అన్నారు. మునుగోడు మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దాతలు ముందుకు వచ్చి ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కర్నాటి స్వామి, ఎస్ఐ డి. సతీష్ రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల గడువు పెంపు

నల్లగొండ: పోస్ట్ మెట్రిక్, ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం బీసీ, ఈబీసీ విద్యార్థుల దరఖాస్తుల స్వీకరణ గడువు పెంచినటు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి బాలకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15 వరకు పొడిగించినందున పోస్ట్ మెట్రిక్ కోర్సులు చదువుతున్న రెన్యూవల్, నూతన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

తాగునీటికి తంటాలు


చేతిపంపు నుంచి నీటిని తెచ్చుకుంటున్న తూర్పుతండా వాసులు


వ్యవసాయ బావి వద్ద నీటిని తెచ్చుకుంటున్న తండా మహిళలు

- మర్రిగూడ మండలంలో అస్తవ్యస్తంగా నీటి సరఫరా
- ఫ్లోరైడ్ నీటినే తాగుతున్న గిరిజనులు
- సక్రమంగా నీరు సరఫరా చేయాలని వేడుకోలు

మర్రిగూడ : ప్రజలకు శుద్ధ జలాలు అందించాలనే ఉద్దేశంలో రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటికీ మిషన్ భగీరథ ద్వారా కృష్ణాజలాలు అందిస్తోంది. అయితే దాదాపు పది రోజుల నుంచి మండలంలోని పలు గ్రామాలకు నీటి సరఫరా అస్తవ్యస్తంగా కొనసాగుతుండడంతో ప్రజలు తాగునీటి కోసం తంటాలు పడుతున్నారు.

సరిపడా సరఫరాకాని నీళ్లు

మర్రిగూడ మండల పరిధిలోని 20 గ్రామ పంచాయతీలు, 25 ఆవాస ప్రాంతాల్లో 2011 జనాభా లెక్కల ప్రకారం 37,008 మంది జనాభా ఉన్నారు. జనాభా ప్రాతిపదికన ప్రతిరోజు ఒక్కొక్కరికి నిత్యం 100 లీటర్ల కృష్ణా జలాలను సరఫరా చేయాల్సి ఉంటుంది. మండల వ్యాప్తంగా ప్రస్తుతం ఒక్కొక్కరికి 50 నుంచి 60 లీటర్ల నీరు మాత్రమే సరఫరా అవుతోంది. కోదండపురం నుంచి సరఫరా అయ్యే నీరు నాంపల్లి మండలంలోని బట్లపల్లి వద్ద నిత్యం 70లక్షల లీటర్లు ఫిల్టర్ అవుతుంది. నాంపల్లి, మర్రిగూడ, భువనగిరి వరకు ఈ నీరు సరఫరా కావాల్సి ఉంటుంది. ప్రతిరోజు 44లక్షల లీటర్ల కృష్ణా జలాల సరఫరా అవుతుంటాయి..


రాంరెడ్డిపల్లిలో ట్యాంకర్ ద్వారా నీటి పంపిణీ

మోటార్లు దెబ్బతిన్నాయనే సాకుతో..

ప్రస్తుతం వేసవి కావడంతో నీటి సరఫరా అధికంగా చేయాల్సి ఉంటుంది. కానీ మోటార్లు దెబ్బతిన్నాయనే సాకుతో నీటి సరఫరా సక్రమంగా చేయడం లేదు. 2 నుంచి 4 బిందెలు పట్టుకునే సరికి సరఫరా నిలిచిపోతోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. తాగడానికి కూడా నీరు సరిపడా రావడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తూర్పుతండాలో ఫ్లోరైడ్ నీరే దిక్కు

మండల కేంద్రం పరిధిలోని తూర్పుతండాలో కృష్ణా జలాలు సక్రమంగా సరఫరా కాకపోవడం, స్థానిక బోరు కూడా అందుబాటులో లేకపోవడంతో ప్రజలు చేతిపంపు నీటిని లేదంటే వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లి ఫ్లోరైడ్ నీటిని తెచ్చుకుంటున్నారు. ఫ్లోరైడ్ నీటితో అన్నం వండుకుంటే పసుపుపచ్చగా మారుతోందని మహిళలు వాపోతున్నారు. పది రోజుల నుంచి కృష్ణా జలాల నీటి సరఫరా.. నాలుగు రోజుల నుంచి స్థానిక నీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పలువురు మహిళలు వాపోతున్నారు. సమస్యను సర్పంచ్ దృష్టికి తీసుకెళ్తే తాత్కాలికంగా ట్యాంకర్ ద్వారా స్థానిక నీటిని సరఫరా చేశారని చెబుతున్నారు. రాంరెడ్డిపల్లిలో సైతం ట్యాంకర్ ద్వారా నీటిని అందిస్తున్నారు.

అపరిశుభ్రంగా నీటి ట్యాంకులు..

కృష్ణా జలాలు సరఫరా అవుతున్న నీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రపరచకపోవడంతో నీరు కలుషితమవుతోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. బిందెలు, క్యాన్లలో నీటిని పట్టుకున్నప్పుడు దిగువ భాగంలో ఫ్లోరైడ్, సూక్ష్మక్రిములు పేరుకున్నట్లు కనిపిస్తున్నాయని, లెంకలపల్లి, సరంపేట, రాంరెడ్డిపల్లి గ్రామాలతోపాటు పలు గ్రామాల ప్రజలు చెబుతున్నారు. నీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రపరిచి తాగునీటి సరఫరా సక్రమంగా జరిగేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వ్యవసాయ బోరు నుంచి నీళ్లు తెచ్చుకుంటున్నాం



చేతిపంపును కొట్టడానికి చేతకాకపోవడంతో 60 ఏళ్ల వయసులో వ్యవసాయ బోరు వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నాం. అన్నం వండితే పచ్చగా ఉంటుంది. నీళ్లు సరిపడా లేక ఇబ్బందులు పడుతున్నాం.

– జర్పుల తులసీ, తూర్పుతండా

నీరు రాక వారం రోజులవుతోంది



కృష్ణానీరు సరఫరా కాక వారం రోజులవుతోంది. ఉదయం రెండు బిందెల నీరు మాత్రమే సరఫరా అయ్యింది. వంటలు చేసుకోవడానికి, తాగడానికి ఆ నీరు సరిపోదు. మళ్లీ ఎప్పుడొస్తుందో తెలియని పరిస్థితి ఉంది.

– జర్పుల కేసి, తూర్పుతండా

మోటార్లు దెబ్బతిన్నాయి

కోదండపురంలో మోటార్లు దెబ్బతిన్నాయి. రెండు పంపుల ద్వారా సరఫరా కావాల్సిన నీరు ఒకే పంపు ద్వారా కొనసాగుతోంది. మరొక పంపు చెడిపోయింది. మరమ్మతులు చేపట్టారు. గ్రామస్తులకు నీరు సరిపోవడం లేదని తెలిసింది. త్వరలో సమస్యను పరిష్కరించేందుకు చొరవ చూపుతున్నాం.

– అభిషేక్, గ్రిడ్ ఏఈ

దశాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయండి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, డీఏఓ సుచరిత

నల్లగొండ టౌన్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 3న జిల్లా వ్యాప్తంగా ఉన్న రైతువేదికల్లో నిర్వహించే సంబరాలకు రైతులు, రైతుబంధు సమితి సభ్యులు భారీగా తరలివచ్చి జయప్రదం చేయాలని రైతుబంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం నల్లగొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి క్లస్టర్ పరిధిలోని రైతువేదికలో ఆయా గ్రామాలకు చెందిన వెయ్యి మంది రైతులను సమీకరించనున్నామన్నారు. వారందరికీ వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో భోజనాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు పాల్గొని వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అందిస్తున్న సహకారం, ప్రోత్సాహకాలు, ఇతర సమాచారాన్ని రైతులకు తెలియజేస్తారన్నారు. ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు, ఎద్దులను అలంకరించి ర్యాలీలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. అకాల వర్షాల కారణంగా రైతులు నష్టపోతున్నందున వరిసాగును ముందుకు తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుందని తెలిపారు. వానాకాలం వరినార్లు రోహిణి కార్తెలో పోసుకుని నవంబర్‌లో కోతలు పూర్తి చేసుకోవాలని, యాసంగి సీజన్‌కు సంబంధించి నవంబర్‌లో నార్లు పోసుకుని మార్చిలో కోతలు పూర్తి చేసుకుంటే అకాల వర్షాల నుంచి రైతులు నష్టపోయే అవకాశం ఉండదని అన్నారు. ఈ సందర్భంగా వరి పంట కాలాన్ని ముందుకు తీసుకురావాలని రూపొందించిన పోస్టర్‌ను చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సమావేశంలో డీఏఓ వై.సుచరిత, టీఎస్‌జీఓ జిల్లా అధ్యక్షుడు, ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ మంత్రవాది శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు ఎప్పుడు వచ్చినా గెలుపు నాదే


కేక్ కట్ చేస్తున్న నేతి విద్యాసాగర్, వేముల వీరేశం

నకిరేకల్ : ఎన్నికలు ఎప్పుడు వచ్చినా గెలుపు తనదేనని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్‌లో వీరేశం జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పన్నాలగూడెంలో సభావేదికపై ఆయన మాట్లాడారు. ఎవరు ఎన్ని మాట్లాడిన కేసీఆర్, కేటీఆర్‌లే తనకు బాస్‌లు అన్నారు. నేతి విద్యాసాగర్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో కేసీఆర్‌తో మాట్లాడి వేముల వీరేశంకు టికెట్ ఇప్పించి గెలిపించే బాధ్యత తీసుకుంటామన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి వచ్చిన అనుచరులు వీరేశంకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సత్కరించారు. కంచర్ల కృష్ణారెడ్డి, పూజర్ల శంభయ్య, హైకోర్టు న్యాయవాది చలకాని వెంకన్న యాదవ్, యానాల లింగారెడ్డి, గాదగోని కొండయ్య, వెంకటరామిరెడ్డి, యాదగిరి, రాజిరెడ్డి, సుందర్, సత్తయ్య, మున్సిపల్ కౌన్సిలర్లు పన్నాల పావని శ్రీనివాస్‌రెడ్డి, యాసారపు లక్ష్మి వెంకన్న, చౌగోని రజిత శ్రీను, వంటెపాక సోమలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

మునుగోడు : రోడ్డు ప్రమాదంలో మరణించిన మునుగోడుకు చెందిన బీసం స్వామి అంత్యక్రియలకు మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పంపిన రూ. 10వేల ఆర్థిక సహాయాన్ని గురువారం బాధిత కుటుంబ సభ్యులకు స్థానిక బీజేపీ నాయకులు అందించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు తాటికొండ సైదులు, సాగర్ల లింగస్వామి, ఎండీ అన్వర్, బీసం విజయ్, సునీల్ సులేమాన్, గంగరాజు తదితరులు ఉన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

ఆపదలో ఉన్న కార్యకర్తలకు అండగా ఉంటానని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నారబోయిన రవి ముదిరాజ్ అన్నారు. మునుగోడు మండలంలోని ఇప్పర్తి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు రేపాక శంకర్ భార్య లీలావతి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. గురువారం జరిగిన దశదిన కర్మకు ఆయన హాజరై బాధిత కుటుంబ సభ్యులకు రూ. 10 వేల ఆర్థిక సహాయం అందజేసి ఓదార్చారు. ఆయన వెంట భవనం శ్రీనివాస్ రెడ్డి, పలివెల ఎంపీటీసీ చెర్కు కృష్ణయ్య, వనం యాదయ్య, బోయపల్లి రమేష్, గణేశ్, బండారు మల్లేష్, రేవెల్లి నర్సింహ, నారగోని నర్సింహ, గుండాల పరమేష్ తదితరులు ఉన్నారు.


మునుగోడు : లీలావతి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నారబోయిన రవి

అభాగ్యురాలికి ఆర్థిక సాయం

కేతేపల్లి : మండలంలోని భీమారం గ్రామానికి చెందిన షేక్ నజీమా భర్త తొమ్మిదేళ్ల క్రితం మృతి చెందాడు. కూతురు రిజ్వాన పుట్టుకతో కాళ్లు, చేతులు పడిపోయి కదల్లేని స్థితిలో ఉంది. కడు పేదరికంలో ఉన్న నజీమా కుమార్తెను పెంచేందుకు అష్టకష్టాలు పడుతోంది. అభాగ్యురాలి పరిస్థితిని గుర్తించి గురువారం మన ప్రాణదాతలు ఫౌండేషన్ నిర్వాహకులు రూ.6 వేలు, కొండ భాస్కర్ రూ. 5 వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకులు మెరుగుమల్ల రాజు, కొండ భాస్కర్, రమణయ్య, ఆనయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కనగల్ : మండల కేంద్రానికి చెందిన కంబాల శివలీల(ఆర్ఎంపీ) కంటి చూపు కోల్పోవడంతో గురువారం ఆమెను బీజేపీ రాష్ట్ర నాయకురాలు కన్మంత రెడ్డి శ్రీదేవి పరామర్శించి రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ కరోనా సమయంలో వందలాది మంది నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేసిన శివలీలకు ఇలాంటి కష్టం రావడం బాధాకరమన్నారు. కంటి చూపు రావడానికి రూ.2లక్షలు ఖర్చు అవుతుందని, దాతలు ముందుకు రావాలన్నారు. ఆమె వెంట బీజేపీ నాయకుడు పాలోజు భిక్షమాచారి తదితరులు ఉన్నారు.

వీఓఏల సమ్మె వాయిదా


సమావేశంలో మాట్లాడుతున్న తుమ్మల వీరారెడ్డి

నల్లగొండ టౌన్: పంచాయితీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హామీ మేరకు 44 రోజులుగా చేస్తున్న వీఓఏల సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నామని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి అన్నారు. గురువారం నల్లగొండలోని దొడ్డి కొమరయ్య భవన్‌లో జరిగిన వీఓఏల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు వీఓఏల న్యాయమైన సమస్యలు పరిష్కరించి, వేతనాలను పెంచుతామని హామీ ఇచ్చారని తెలిపారు. మంత్రి హామీ మేరకు సమ్మెను వాయిదా వేయాల్సి వచ్చిందన్నారు. హామీలను అమలు చేయకపోతే మరో పోరాటం చేయకతప్పదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ, చిలుముల దుర్గయ్య, భీమగాని గణేష్, వై.కోటిరెడ్డి, పి.సులోచన, రేణుకాదేవి, జె.లలిత, సుమీల, తండు సైదమ్మ, సిరియాల, పుష్పలత, ఎం.వనజ, వై.పద్మావతి, సైదులు, మమత, నాగమణి పాల్గొన్నారు.

అసంపూర్తిగా స్త్రీశక్తి భవన నిర్మాణం


అసంపూర్తిగా ఉన్న స్త్రీ శక్తి భవనం

మునుగోడు : మండల కేంద్రంలో 2013వ సంవత్సరంలో మొదలుపెట్టిన స్త్రీశక్తి భవన నిర్మాణం పదేళ్లు గడిచినా నేటికి పూర్తి కాలేదు. మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో ఉపాధి హామీ, ఐకేపీ కార్యాలయాలకు కలిపి ఒకే భవనంలో భవన నిర్మాణానికి గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరు చేసింది. ఉపాధిహామీ నిధుల నుంచి రూ 25 లక్షల నిధులు మంజూరు చేయగా అప్పటి ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు పనులు ప్రారంభించారు. గత ఏడాది క్రితం వరకు పనులు చేపట్టడంతో దాదాపు 80 శాతం పనులు పూరయ్యాయి. కానీ మిగిలిన పనులు నేటికీ పూర్తిచేయకపోవడంతో భవనం ప్రారంభించక ముందే శిథిలమయ్యే ప్రమాదం ఉందని పలువురు వాపోతున్నారు. సంబంధిత అధికారులు ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని భవన నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

నేటి నుంచి ఆలయ వార్షికోత్సవాలు


శ్రీసాయి మణికంఠ ఆలయం

కట్టంగూర్ : మండల కేంద్రంలోని శ్రీసాయి మణికంఠ ఆలయంలో శుక్రవారం నుంచి 13వ వార్షికోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ శాశ్వత చైర్మన్, ఎంపీపీ జెల్లా ముత్తిలింగయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్రహ్మశ్రీ వెంకటేశ్వర శర్మ, గురుస్వామి, ఆలయ పూజారి సత్యనారాయణ శర్మల ఆధ్వర్యంలో పూర్ణాహుతి, అష్టోత్తర శతకలశపూజ, కళశాభిషేకం, అయ్యప్ప స్వామివారికి నవాభిషేకం, సాయిబాబా విగ్రహానికి అభిషేకాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

వైభవంగా కంఠమహేశ్వర స్వామి ఉత్సవాలు


విగ్రహ ప్రతిష్ఠాపన చేస్తున్న అర్చకులు

చండూరు(గట్టుప్పల) : గట్టుప్పల మండల కేంద్రంలో శ్రీ కంఠమహేశ్వర స్వామి-సురమాంబ విగ్రహాల ప్రతిష్ఠాపన, కల్యాణ ఉత్సవాలు గురువారం వైభవంగా కొనసాగాయి. బండారు చంద్రయ్య ఆధ్వర్యంలో రెండో రోజు ధాన్యాదివాసం, ఫలాదివాసం, దేవతామూర్తుల ప్రాణ ప్రతిష్ఠాపన, దీపారాధన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ వేడుకలకు వేలాది మంది భక్తులు హాజరై పూజలో పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

నల్లగొండ టౌన్ : సంక్షేమ బోర్డు ద్వారా నిర్వహించే ఉచిత వైద్యశిబిరాలను భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ సలీం, సీఎస్సీ హెల్త్‌కేర్ డాక్టర్ తుల మోహన్ అన్నారు. గురువారం స్థానిక దొడ్డి కొమరయ్య భవన్‌లో భవన నిర్మాణ రంగ కార్మికులకు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా కార్మికులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో దండెంపల్లి సత్తయ్య, చిరుమర్తి శ్రీనివాస్, బండారు శంకరయ్య, మధు, సత్యనారాయణ, సైదాచారి, నర్సింహ, శంకర్, నవీన్, యాదయ్య పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్ష

మునుగోడు : మండలంలోని కిష్టాపురం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఫార్మా కంపెనీ వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఆ గ్రామస్తులు చేస్తున్న రిలే దీక్షలు కొనసాగాయి. గురువారం దీక్షలో ఆ గ్రామానికి చెందిన ముస్లింలు కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో ఫార్మా వ్యతిరేక పోరాట కమిటీ కన్వీనర్ భీమనపల్లి సైదులు పాల్గొన్నారు.


దీక్షలో కూర్చున్న ముస్లింలు

ముగిసిన శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ బ్రహ్మోత్సవాలు

కనగల్ : దర్వేశిపురం(పర్వతగిరి) శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ బ్రహ్మోత్సవాలు గురువారం ముగిశాయి. చివరిరోజు అమ్మవారికి లక్ష కుంకుమార్చన, ఏకాంత సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓ జల్లేపల్లి జయరామయ్య, సర్పంచ్‌లు అల్లుబెల్లి పూలమ్మ, చనగాని అంజమ్మరామచంద్రు, ఎంపీటీసీ నకిరేకంటి శైలజసైదులు, బీఆర్ఎస్ నాయకులు అల్లుబెల్లి నర్సింహారెడ్డి, నల్లబోతు యాదగిరి అర్చకులు నాగోజు మల్లాచారి, శ్రవణకుమారాచార్యులు, దామోదర్, మహేష్, ఫణి, శ్రీను, నాగరాజు ఆలయ సిబ్బంది జినుకుంట్ల చంద్రయ్య, లింగయ్య, లింగస్వామి, ఉపేందర్‌రెడ్డి, నాగరాజు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన 'కంటి వెలుగు'

మాడుగులపల్లి: మండలంలోని చిరుమర్తి గ్రామంలో కంటి వెలుగు శిబిరం గురువారం ముగిసింది. గత నెల 25 నుంచి గ్రామస్తులకు కంటి పరీక్షలు నిర్వహించారు. మొత్తం 1664 మంది జనాభా ఉండగా 900 మందికి పరీక్షలు చేశారు. వీరిలో 150 మందికి రీడింగ్ గ్లాసులు, 111 మందికి కళ్లద్దాలు అవసరమని గుర్తించి అందించినట్లు పాములపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి సంజయ్ కుమార్ తెలిపారు.

ఏఎమ్మార్పీ కాల్వపై సిమెంట్ గోడల తొలగింపు


సిమెంట్ గోడను తొలగిస్తున్న ఇరిగేషన్ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

రామగిరి(నల్లగొండ) : తిప్పర్తి మండలంలో ఏఎమ్మార్పీ కాలువల ఆక్రమణలపై సాక్షి దిన పత్రికలో వచ్చిన కథనానికి ఇరిగేషన్ అధికారులు స్పందించారు. మే 30వ తేదీ మంగళవారం 'కబ్జా కోరల్లో ఏఎమ్మార్పీ కాలువలు' అనే శీర్షికతో సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీంతో కేశరాజుపల్లిలో ఏఎమ్మార్పీ కాలువను ఆక్రమించుకుని సిమెంట్ గోడలు ఏర్పాటుచేసిన భూయజమానికి ఇరిగేషన్ అధికారులు నోటీసులు జారీ చేశారు. అయినప్పటికీ యజమాని స్పందించకపోవడంతో ఏఈఈ సుభాష్ ఆదేశాల మేరకు బుధవారం సిబ్బంది సిమెంట్ గోడను తొలగించారు. ఈ సందర్భంగా ఏఈఈ మాట్లాడుతూ ఏఎమ్మార్పీ కాలువలు ప్రభుత్వ ఆధీనంలో ఉంటాయని ఎవరైనా ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అలంకారప్రాయంగా వైకుంఠధామాలు

- శ్మశానవాటికల్లో మౌలిక వసతులు కరువు
- కొన్ని గ్రామాల్లో నాసిరకంగా నిర్మాణాలు
- వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్న ప్రజలు


అందుబాటులోకి రాని దోరెపల్లి వైకుంఠధామం



అసంపూర్తిగా బచ్చన్నగూడెం శ్మశానవాటిక

కనగల్ : పల్లె ప్రగతిలో భాగంగా గ్రామాల్లో నిర్మించిన వైకుంఠధామాలు నిరుపయోగంగా మారాయి. వసతులు పూర్తిస్థాయిలో లేకపోవడంతో వాటిని ప్రజలు వినియోగించుకోవడం లేదు. దీంతో రూ.లక్షల వ్యయంతో నిర్మించిన వైకుంఠధామాలు కొన్ని గ్రామాల్లో అలంకారప్రాయంగా మారాయి.

31 గ్రామపంచాయతీల్లో..

కనగల్ మండలంలోని 31 గ్రామపంచాయతీల్లో ఒక్కో వైకుంఠధామాన్ని రూ.12.50 లక్షలతో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు ద్వారా నిర్మించారు. నేటి వరకు 6 వైకుంఠధామాలకు మాత్రమే విద్యుత్ సరఫరా అవుతోంది. మిగతా 25 శ్మశానవాటికల్లో విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయలేదు. 15 శ్మశానవాటికల్లో మాత్రమే నీటి సౌకర్యం కల్పించగా మిగతా 16 గ్రామాల్లోని వైకుంఠధామాల్లో నీటి సదుపాయం కల్పించకపోవడంతో అవి అలంకరప్రాయంగా మారాయి. కొన్ని గ్రామాల్లో వైకుంఠధామాల్లో బర్నింగ్ షెడ్, టాయిలెట్స్, విద్యుత్, నీటి సౌకర్యం కల్పించలేదు. కొన్ని వైకుంఠధామాల్లో కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా నేటికీ పనులు ముందుకు కదలడం లేదు. కొందరు సర్పంచ్‌లు వైకుంఠధామాల నిర్మాణాల్లో నాసిరకమైన సామగ్రి ఉపయోగించి పనులు చేయించడంతో ప్రారంభానికే ముందే వైకుంఠధామాలకు పగుళ్లు వస్తున్నాయి. నిర్వహణ లేకపోవడంతో టాయిలెట్స్ అధ్వానంగా తయారయ్యాయి.

లోతట్టు ప్రాంతాల్లో 25 వైకుంఠధామాలు

మండల వ్యాప్తంగా ఉన్న 31 వైకుంఠధామాల్లో 25 వరకు లోతట్టు ప్రాంతాల్లో నిర్మాణాలు చేపట్టారు. వర్షం వస్తే నీరు నిలిచి బురదమయంగా తయారవుతోందని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. ఎవరైనా మరణిస్తే చేసేదేమి లేక ఆయా గ్రామాల్లో ప్రజలు సొంత భూముల్లోనే అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. శ్మశానవాటికల్లో డోర్లు, కిటికీలు, ప్రధాన గేట్లకు నాసిరకం మెటీరియల్ వాడడంతో ప్రారంభానికే ముందే శిథిలావస్థకు చేరుకుంటున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వైకుంఠధామాల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరుతున్నారు.

వసతులు కల్పించాలి



వైకుంఠధామాల్లో నీటి వసతి, విద్యుత్ వసతి కల్పించాలి. లక్షలు వెచ్చించి నిర్మించిన శ్మశానవాటికలు అందుబాటులోకి తేవడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు కృషిచేయాలి.

– కలకూరి నాగరాజు, చర్లగౌరారం

అందుబాటులోకి తీసుకువస్తాం



వైకుంఠధామాల్లో పెండింగ్‌లో ఉన్న పనులు చేయిస్తున్నాం. వారం, పది రోజుల్లో మండల వ్యాప్తంగా ఉన్న శ్మశానవాటికల్లో పెండింగ్ పనులు పూర్తి చేయించి అందుబాటులోకి తీసుకువస్తాం.

– డి సోమసుందర్‌రెడ్డి, ఎంపీడీఓ, కనగల్